క్లుప్తంగా

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ్‌భాస్కర్

డోన్ రూరల్ : మండల పరిధిలోని ఉడుముల పాడు గ్రామం వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విజయ్ భాస్కర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అరుణ్ కుమార్, ఎంపీహెచ్ఈఓ ప్రభాకర్, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

డోన్ టౌన్ : ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16వ తేదీ ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో ఏఏ కోర్సులు ఉన్నాయి, వాటి ఉపయోగాలు, ల్యాబ్‌లు, వసతుల గురించి అధ్యాపకులు వివరిస్తారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా, బాలసాయి ఏపీఆర్‌జేసీ, పట్టణంలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు తప్పని సరిగా హాజరై భవిష్యత్ చదువులకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె సూచించారు.

పండ్ల తోటల సాగులో మెలకువలు పాటించాలి



చీని చెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారిణి ధరణి

కొలిమిగుండ్ల: పండ్లతోటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని కోవెలకుంట్ల ఉద్యానశాఖాధికారిణి ధరణి సూచించారు. మంగళవారం కొలిమిగుండ్లలో పలువురు రైతులకు చెందిన చీని తోటలను ఆమె పరిశీలించారు. ఆకులకు నల్లటి మచ్చలు రావడం గుర్తించి నివారణకు మందులు వాడాలని రైతులకు సూచించారు. టెంకాయ మొక్కలు ఎకరాకు 60 నాటుకుంటే సబ్సిడీ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది ఫిరోజ్,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి హిందూ ధర్మ రక్షణకు విరాళాల సేకరణ

బనగానపల్లెరూరల్: విశ్వహిందూపరిషత్ బనగానపల్లె ప్రఖండ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేది నుంచి హిందూ ధర్మరక్షా నిధి సమర్పణ కార్యక్రమం చేపట్టినట్లు విశ్వహిందూ పరిషత్ బనగానపల్లె ప్రఖండ కార్యదర్శి జి.ఓబులరెడ్డి మంగళవారం తెలిపారు.సమాజ అభ్యున్నతికి మనం,మనవంతు సహకారం అవసరమన్నారు.దీనికి శ్రమించే కార్యకర్తలకు హిందూ సమాజం అండదండలు ఎంతో అవసమన్నారు.

అనాథ శరణాలయానికి విద్యార్థుల విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలోని శ్రీ వాసవీ విద్యామందిర్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు వెలుగోడలోని ప్రగతి అనాథ శరణాలయానికి రూ.4,410 విరాళాన్ని మంగళవారం శరణాయల నిర్వాహకులు చంద్రశేఖర్‌కు అందజేశారు. విద్యార్థులు సేకరించిన నగదును శరణాలయానికి అందజేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ రాజశేఖర్ తెలిపారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



సంఘం నూతక కమిటీ సభ్యులతో రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రామసుబ్బయ్య

బేతంచెర్ల: హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు పబ్బతి రామసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆ సంఘం డోన్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు నరాల నాగరాజు అధ్యక్షతన మంగళవారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాముడు, అధ్యక్షుడిగా మణిధర్, ఉపాధ్యాక్షుడిగా సుధాకర్, కార్యదర్శిగా సురేష్, జాయింట్ సెక్రటరీ ప్రతాప్‌ను ఎంపిక చేసినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు చిన్న సుబ్బయ్య, కన్వీనర్ మునుస్వామి, సభ్యులు మార్కు, కంబయ్య, సాల్మన్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక.. సంగమేశ్వర ఆలయం

- 18వ తేదీ నుంచి శివరాత్రి, నూర్‌షావలి ఉత్సవాలు
- ఒకవైపు శివాలయం.. మరోవైపు నూర్‌షావలి దర్గా
- ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం
- శ్రీకృష్ణదేవరాయల కాలంతో ముడిపడ్డ చరిత్ర



ఆలయానికి ఒకవైపు సంగమేశ్వర, మరోవైపు నూర్‌షావలి దర్గా ఉన్న దృశ్యం



ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగం



దర్గాలో నూర్‌షావలి సమాధి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సమీపంలోని కుందూనది ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయం, నూర్‌షావలి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఆలయంలో ఒక వైపు శివాలయం, మరోవైపు నూర్‌షావలి దర్గా నిర్మించగా ప్రతి ఏటా శివరాత్రి పండగ సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో ప్రతి ఏటా శివరాత్రి, నూర్‌షావలి ఉరుసు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటితో ఆలయ చరిత్ర ముడిపడి ఉంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన పండగ జాగరణ, ఆ మరుసటి రోజు నుంచి రెండు రోజులపాటు నూర్‌షావలి ఉరుసు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శివాలయం, నూర్‌షావలి దర్గా ఉత్సవాలకు ముస్తాభవుతున్నాయి. శనివారం శివరాత్రి, ఆదివారం నూర్‌షావలి దర్గాలో గంధం, సోమవారం ఉరుసు కార్యక్రమాలు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు పట్టణ ప్రజలేకాక వివిధ ప్రాంతాల నుంచి హిందూ, ముస్లిం సోదరులు ఆలయానికి చేరుకుని శివరాత్రి వేడుకలు, ఉరుసు ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకోనున్నారు.

సంగమేశ్వర ఆలయ చరిత్ర

సుమారు ఐదు వందల సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో 14చోట్ల ఈశ్వర దేవాలయాలు నిర్మించారు. ఇందులో భాగంగా కోవెలకుంట్ల పట్టణ శివారులో కుందూనది ఉత్తరం నుంచి తూర్పుకు ప్రవహిస్తూ, జుర్రేరువాగు కుందూలో కలిసే ప్రాంతంలో నది ఒడ్డున ఈశ్వర దేవాలయం నిర్మించారు. నూర్‌షావలి అనే భక్తుడు శివన్నామస్మరణ చేస్తూ దేశ పర్యటనలో భాగంగా ఈ ప్రాంతానికి చేరుకుని ఇక్కడే శివుడికి నిత్య పూజలు చేసేవారనే నానుడి. కొంత కాలం తర్వాత శివాలయం ఉన్న ప్రాంతంలో జీవసమాధి అయ్యాడు. నూర్‌షా వలి వంశానికి చెందిన ఒక మహిళకు ఈశ్వరుడు కలలో కనిపించి శివాలయంలోనే నూర్‌షావలి దర్గా కట్టించాలని చెప్పినట్లు పూర్వికుల సమాచారం. దీంతో ఆలయంలో ఒక వైపు శివాలయం , మరో వైపు నూర్‌షావలి దర్గాను నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా శివరాత్రి పండగ రోజున శివరాత్రి వేడుకలు, మరుసటి రోజు నుంచి రెండు రోజులపాటు నూర్‌షావలి ఉరుసు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో షార్ట్‌టర్మ్ కోర్సులు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మూడు నెలల్లో పూర్తయ్యే షార్ట్ టర్మ్ కోర్సులు ప్రవేశ పెట్టినట్లు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపీనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో డోన్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో షార్ట్ టర్మ్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, ఫిట్టర్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ కోర్సులలో చేరే వారు 10వ తరగతి చదివి ఉండాలన్నారు. అంతేకాకుండ మంత్రి ప్రత్యేక చొరవతో త్వరలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ భాగస్వామ్యంతో డాకిన్ కంపెనీ ప్రతినిధులు ఐటీఐలో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ఎయిర్ కండీషనర్ సర్వీస్ టెక్నిషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

సౌకర్యవంతంగా వసతిగృహ నిర్మాణం



వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : ఐటీఐ విద్యార్థులకు సౌకర్యవంతంగా 300 పడకల వసతి గృహాన్ని నిర్మిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంగళవారం ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, ధారా హరినాథ్‌రెడ్డితో కలిసి చైర్మన్ వసతి గృహం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా డోన్ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 300 పడకల వసతి గృహం కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి బయటి ప్రాంతాల నుండి ఐటిఐలో చదివేందుకు వచ్చిన విద్యార్థుల కోసం ఒకేచోట వసతి కల్పించేందుకు కృషి చేశారని అభినందనలు తెలిపారు. ఆరు నెలల్లో వసతిగృహ నిర్మాణం దాదాపు పూర్తవుతుందని చెప్పారు.

అమర జవాన్ల త్యాగాలను మరువ రాదు



అమర్ రహై అంటూ నినాదాలు చేస్తున్న దృశ్యం



జెండాను ప్రదర్శనగా తీసుకెళ్తున్న దృశ్యం

డోన్ టౌన్: జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమర జవాన్ల త్యాగాలను మరువరాదని, సేవలను స్మరించుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిశేఖర్, భాగ్ కన్వీనర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు వెయ్యి మీటర్ల జాతీయ జెండాను విద్యార్థులు ప్రదర్శనగా తీసుకెళ్లారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మృతి చెందిన 44మంది జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న మన జవాన్లపై పాకిస్తాన్ తొత్తులు దాడి చేయడంతో 44మంది వీర మరణం పొందారని గుర్తు చేశారు. ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా గుర్తించాలని వారు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, దివాకర్, జగన్, పవన్, సురేష్, చరణ్, సాయి కుమార్, రాకేష్, సృజన్, మహేష్, రవి కిరణ్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మరింత భద్రత



అహోబిలంలో ఏపీ టూరిస్టు పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: దైవదర్శనం నిమిత్తం ఆలయాలకు వచ్చే భక్తులకు ప్రభుత్వం ఏపీ టూరిస్ట్ పోలీస్ స్టేషన్ల ద్వారా మరింత భద్రత కల్పిస్తుందని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో మంగళవారం ఏపీ టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం క్యాంప్ కార్యాలయం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ఏపీ టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐతో పాటు ఆరుగురు పోలీస్ సిబ్బంది షిఫ్ట్ డ్యూటీలుగా పని చేయడం జరుగుతుందన్నారు. మహిళల ఫిర్యాదుల కోసం మహిళా పోలీస్ కూడా అందుబాటులో ఉంటారన్నారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఫోన్ నంబర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు నరసింహులు, నిరంజన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు జీవనోపాధి మార్గాలు ఎంచుకోవాలి



ఫినాయిల్ బాటిల్ అందజేస్తున్న ఆదినారాయణరెడ్డి

కొలిమిగుండ్ల: కుటుంబాల ఆర్థికాభివృద్ధికి మహిళలు జీవనోపాధి మార్గాలు ఎంచుకోవాలని సమత పౌండేషన్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి సూచించారు. మంగళవారం చింతలాయిపల్లెలోని సంస్థ కార్యాలయంలో ఫినాయిల్ తయారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫినాయిల్, డిటర్జంట్ పౌడర్, ఊరగాయల తయారీ తదితర వాటిని ఇళ్లలోనే తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు.చాలామంది మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని రాణిస్తున్నారని, తమ పౌండేషన్ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మునీశ్వరి, సమత సొసైటీ మేనేజర్ భాస్కర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లె ఉప సర్పంచ్ మృతి



లక్ష్మికాంతరెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి సోదరుడి కుమారుడు, ఉపసర్పంచ్ కొప్పుల లక్ష్మికాంతరెడ్డి(46) మంగళవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం తీర్థయాత్రల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో అస్వస్థతకు గురి కావడంతో మధ్యలో మందులు తీసుకున్నాడు. రాత్రికి ఇంటికి చేరుకోగానే పూర్తిగా అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి పరిస్థితి విషమంగా ఉందని సూచించడంతో అనంతపురానికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు ఓబులరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ మొలక రాజారెడ్డి, అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, టీసీ వెంకట్రాముడు తదితరులు పెద్ద ఎత్తున కేపీ నివాసం చేరుకున్నారు. కొప్పుల లక్ష్మికాంతరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వినోద్ కుమార్

అవుకు: ప్రతి రోజు సైక్లింగ్ చేయడం మూలంగా ఆరోగ్యం మెరుగు పడుతుందని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మండల కేంద్రం అవుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో హెల్త్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంపై అందరూ దృష్టి సాచించాలన్నారు. ప్రతి రోజు సైక్లింగ్, యోగా పాటిస్తే అనేక ప్రయోజనాలు చేకూరుతాయని, మానసిక ఒత్తిడి తగ్గి మెదడు చురుగ్గా పనిచేయటమే కాకుండా అధిక క్యాలరీలు ఖర్చుతో సుఖ నిద్ర పొందుతారని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సైక్లింగ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుబ్బరాయుడు, సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, వేణుగోపాల్‌రాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హాజీవలి, మహమ్మద్ సల్మాన్‌ఖాన్, జ్యోతిబాయ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్యాపిలి:ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని వైద్యాధికారిణి వాణిశ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ హెల్త్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణితో పాటు వైద్య సిబ్బంది, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సైకిల్ తొక్కుతూ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ క్యాన్సర్, బీపీ, షుగర్, గుండె జబ్బులతో పాటు అనేక సమస్యలకు వ్యాయామమే దివ్య ఔషిధం అన్నారు. వ్యాయామం, యోగా చేయడం ద్వారా మానసిక, శారీరక ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, రాఘవేంద్రగౌడ్, గంగాదేవి, మనోహర్‌రెడ్డి, యశోద, శ్రీజ, మల్లేశ్వరి, కళ్యాణి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బేతంచెర్ల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం, వ్యాయామం, ఆహార అలవాట్లపై ఏఎన్‌ఎం మునేశ్వరమ్మ అవగాహన కల్పించారు. సైక్లింగ్, వ్యాయామం, ధ్యానంతో కలిగి ఆరోగ్య ప్రయోజనాలను ఆమె విద్యార్థులు వివరించారు.

గ్రామదేవతలకు పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు మాఘమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

విగ్రహాలకు రక్షణ కల్పించాలి

బేతంచెర్ల: ప్రపంచ దేశాలకు ఆదర్శమైన రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ విగ్రహాన్ని నంద్యాలలో ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మాల మహానాడు సంఘం నాయకులు మేకల నాగరాజు, మద్దిలేటి, రూబెన్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మాల మాహానాడు, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలల వేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ దేశ నాయకులు అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం, గుడుంబాయి తండా నుంచి నాటుసారాను బేతంచెర్లకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ ప్రియతం రెడ్డి మంగళవారం తెలిపారు. బేతంచెర్ల పట్టణంలో దుర్గాపేట కాలనీకి చెందిన ముద్దవరం శేషు నాటుసారా తీసుకొని వస్తుండగా సీతారామాపురం మెట్ట వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి 45 లీటర్ల సారాతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మాట్కా నిర్వాహకుడి అరెస్టు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురంలో మట్కా నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. తలారి మధుసూదన్ మట్కా నిర్వహిస్తుండడడంతో అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.9850 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాల వేలం

బేతంచెర్ల: మండలంలో నాటుసారా కేసులో పట్టుబడిన నాలుగు ద్విచక్రవాహనాలకు మంగళవారం సీఐ ప్రియతం రెడ్డి, ఏఎస్ఐ లింగమ య్య ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో జీఎస్టీతో కలుపుకొని రూ. 69,596 ఆదాయం వచ్చినట్లు ఏఎస్ఐ తెలిపారు.

దామోదరం సంజీవయ్య జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

బేతంచెర్ల : దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాల్గవ గ్రామ సచివాలయంలో మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య అట్టడుగు వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారన్నారు. పేద దళితులకు 6లక్షల ఎకరాల బంజర్ భూమిని పంచి పెట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. చట్టాలను సవరించి సమన్వయపరచటానికి లా కమిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు బాల పుల్లయ్య, నాయకులు ఎద్దుల సుధాకర్, ఎన్నా జార్జి, పెరుమాల్, రమేష్, శేఖర్, రవి సుబ్బరాయుడు, భాస్కర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనా విధానం మారాలి

నంద్యాల(సిటీ): విద్యార్థుల ఆలోచన విధానాల్లో మార్పు రావాలని ఆర్ఏఆర్ఎస్ సైంటిస్టు నరసింహులు సూచించారు. ప్రకృతిలోని ప్రతి అంశాన్ని పరిశీలించే అలవాటును చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎస్పీజీ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. డీఈఓ అనురాధ జ్యోతి ప్రజ్వలన చేయగా, సీవీ రామన్ చిత్రపటానికి డిప్యూటీ విద్యాశాఖ అధికారి మహమ్మద్ బేగ్ పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి, సైంటిస్టు నరసింహులు మాట్లాడుతూ మారిన సిలబస్‌ను అనుసరించి ప్రతి పాఠంలో సైన్స్ కృత్యాలు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకొని బాల సైంటిస్టులుగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలోనే కొత్త ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలకు పునాదులు వేసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌కు 160 సైన్స్ ఎగ్జిబిట్స్ వచ్చాయని, వాటిలో ఉత్తమప్రతిభ, సమాజానికి అవసరమయ్యే ప్రథమ స్థానం పొందిన ఎగ్జిబిట్స్‌ను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

విజేతలు..

మొదటి ప్రాజెక్టు కింద పర్యావరణ హిత పదార్థాల వాడకం సురేంద్ర(జెడ్పీహెచ్‌ఎస్) వేంపెంట మొదటి బహుమతి, రెండవ బహుమతి రేణుక (కేజీబీవీ కొత్తపల్లి), రెండో సైన్స్ ప్రాజెక్టు కింద ఆరోగ్యం, పరిరక్షణకు రహంతుల్లా (ఏపీ మోడల్ స్కూల్, అవుకు), రెండో బహుమతి ఉదయ్‌కిరణ్ (జెడ్పీహెచ్ఎస్, పాములపాడు), మూడవ ప్రాజెక్టు కింద సాఫ్ట్‌వేర్ ఆక్స్‌లో సజియ(జెడ్పీహెచ్ఎస్, దుద్యాల) మొదటి బహుమతి, రెండో బహుమతి కింద శ్రీనివాస్(ప్రభుత్వ హైస్కూల్, పాంపల్లి) ప్రాజెక్టులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మం, రామబ్బయ్య, కోటయ్య, జీవలత, మాధురి, అసదుల్లా, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్, శేషఫణి, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించండి

నంద్యాల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పురోగతిపై సీడీపీఓలు, విద్యా, వైద్యాధికారులు ఏపీఎంలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించడం, ఆహారం , ఆరోగ్యం, అసమానతలను తగ్గించడం, తదితర ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడంపై సంబంధిత అధికారులు అత్యంత చురుకుగా పని చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలు డేటా ప్రకారం చూస్తే నమ్మశక్యంగా లేదని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలలో మిడుతూరు 59 శాతం, దొర్నిపాడు 54 శాతం మంది పిల్లలు బరువు, ఎత్తు తక్కువగా ఉన్నట్లు చూపుతున్నారని, స్వయంగా పరిశీలించేందుకు చర్యలు తీసుకోవాలని స్త్రీ సంక్షేమ శాఖ పీడీ లీలావతిని ఆదేశించారు. వచ్చే సమావేశానికి కూడా ఇలాంటి పనితీరు ప్రదర్శిస్తే సంబంధిత సీడీపీఓలను సస్పెండ్ చేసేందుకు వెనకాడమన్నారు.

పైపు లీకేజీ .. నీరు వృథా!



వైఎస్ నగర్ ఎన్‌హెచ్ 44 పక్కన పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఎగిసిపడుతున్న నీరు

డోన్ : పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాజుల దిన్నె ప్రాజెక్టు నుంచి ఏర్పాటు చేసిన మంచినీటి పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోంది. జీడీపీ ద్వారా పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి కింద ఏర్పాటు చేసిన పైపులైన్ పగిలి తరచుగా నీరు లీకేజై మంచినీటి సరఫరాకు అంతరాయం జరుగుతుండటంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వీరు ప్రత్యామ్నాయంగా బ్రిడ్జిల కింద నుంచి ఎన్‌హెచ్ 44 దాటించి కొత్త పైపులైన్‌లు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం సమయంలో పైపులైన్ల మధ్య సదరు కాంట్రాక్టర్ జాయింట్‌లు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున తరచూ లీకేజీ అవుతుందని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ పనులను చేపడుతున్నందున ఇప్పటికే పట్టణంలోని చాలా ప్రాంతాలకు మంచినీటి సరఫరా ఆగిపోయిందనే విషయాన్ని కాంట్రాక్టర్ గుర్తుంచుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తే ఇలాంటి పరిస్థితి ఎదురు కాదనే విషయాన్ని కాంట్రాక్టర్‌తో పాటు నేషనల్ హైవే అధికారులు గమనించాలని స్థానికులు కోరుతున్నారు.